ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 20.07.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో పది జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

2. UPSC ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ఈ రోజు ప్రారంభించారు.

3. క్రిటికల్ మినరల్స్ రంగంలో దేశం ఆత్మనిర్భరతను సాధించే దిశగా ఖనిజ వ్యాపార భాగస్వాములంతా కలసి పనిచేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

4. దేశ వ్యాప్తంగా విమాన సేవలు సాధారణ స్థితికి వచ్చాయని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమానాలు యథావిధిగా నడుస్తున్నాయని అధికారులు తెలియజేశారు.

**WEATHER UPDATE**

బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. వాతావరణ శాఖ 10 జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీ చేసింది. నిన్న రాత్రి నుంచి హైదరాబాద్ సహా జిల్లాల్లో వర్షం కురుస్తోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు.

గడిచిన 24 గంటల్లో ములుగు జిల్లాలోని వెంకటాపురంలో అత్యధికంగా 109 మిల్లీమీటర్లు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్లలో 96.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖమ్మం , మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 40 నుంచి 80 మిల్లీ మీటర్ల వరకు వర్షపాతం నమోదైంది.

PN

**RAINS ROUND UP STATE**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో పలు జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలువిద్యుత్ సరఫరా నిలిచిపోయాయి. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షాలు, వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని , అధికారులు అందుబాటులో ఉండాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మున్నేరు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అవసరమైతే లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి నీటిపారుదల , రెవిన్యూ శాఖ అధికారులను అదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో ఆయన అధికారులతో మాట్లాడుతూ.. చెరువు కట్టలు తెగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆసిఫాబాద్ జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు , పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి డివి శ్రీనివాసరావు తెలిపారు. రైతులు పొలాల్లో మోటార్ల వద్ద విద్యుత్ పట్ల అప్రమత్తతో ఉండాలని హెచ్చరించారు.

జగిత్యాల జిల్లాకు ఆరెంజ్ హెచ్చరిక ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులు , వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని ,రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ చెప్పారు. సహాయం కోసం 100 నెంబరులో పోలీసులను సంప్రదించాలన్నారు.

మంచిర్యాల జిల్లాలో ప్రజల సహాయార్థం కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ పర్యటిస్తున్నారు. వరద ముప్పు ఉన్న చోట నుంచి ప్రజలను ప్రత్యేక శిబిరాలకు తరలించాలని అధికారులకు సూచించారు. గోదావరిలో నిన్న చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఆలుబాకా గ్రామానికి చెందిన రాజు మృతదేహాన్ని దుమ్ముగూడెంలో పోలీసులు గుర్తించారు. వనపర్తి జిల్లాలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళవద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప హెచ్చరించారు.

PTCs- KMM, PDPL, ASF, JGL, Yadadri, Siricilla, MNCL, Kottagudem, WNP

**CM- RAJEEV GANDHI CIVILS**

సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం ' పథకాన్ని ప్రారంభించారు. సింగరేణి సంస్థ సహకారంతో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు , హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్యార్థుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడిందని ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని

సాధించుకున్నామన్నారు. నిరుద్యోగుల బాధలు తమకు తెలుసని , అధికారంలోకి రాగానే టీజీపీఎస్‌ను పునర్వ్యవస్థీకరించి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. పరీక్షలు మాటిమాటికి వాయిదా వేయడం సరికాదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి , సింగరేణి సీఎండీ బలరాం పాల్గొన్నారు.

Desk

**MINERALS- KISHAN REDDY**

ఖనిజ రంగంలో ముఖ్యంగా, క్రిటికల్ మినరల్స్ రంగంలో దేశం ఆత్మనిర్భరతను సాధించే దిశగా భాగస్వాములంతా కలసి పనిచేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం బొగ్గు విషయంలో దేశం ఇప్పటికే స్వావలంబన సాధించిందన్నారు. రానున్నకాలంలో ఖనిజ రంగంలో మరిన్ని సంస్కరణలు , విధాన నిర్ణయాలు చేయనున్నట్లు చెప్పారు. ఖనిజాన్వేషణ హ్యాకథాన్ , క్రిటికల్ మినరల్ రోడ్ షో ను కిషన్ రెడ్డి ఈ ఉదయం హైదరాబాద్ లో ప్రారంభించారు. మైనింగ్ రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని పేర్కొన్నారు. క్రిటికల్ మినరల్స్ కు సంబంధించిన 2, 3 విడతల ఈ-ఆక్షన్ కు సంబంధించి ప్రిఫర్డ్ బిడ్డర్స్ కు కాంపోజిట్ అనుమతి పత్రాలను మంత్రి అందజేశారు. జాతీయ జిల్లా ఖనిజ నిధి ( DMF) పోర్టల్ ను, తెలంగాణ మినరల్ స్పాట్ లైట్స్, తెలంగాణ జియోలజీ , ఖనిజవనరుల నివేదికలను కేంద్రమంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ... గనులు సహా అన్ని రంగాలలో పారదర్శకతతో కూడిన అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. క్రిటికల్ మినరల్స్ రంగంలో దిగుమతులను తగ్గించే దిశగా భాగస్వాములంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.

(Sound Byte- GKR)

అంతకు ముందు బొగ్గు, గనుల శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వీణా కుమారీ, GSI డైరెక్టర్ జనరల్ జనార్ధన్ ప్రసాద్ సహా పలువురు ప్రసంగించారు.

---- MSL

**CM REVANTH REDDY**

ఈ మధ్యాహ్నం హైదరాబాద్ నగర శివారులోని గోపన్‌పల్లి తండా వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభిం చనున్నారు. సుమారు 28.5 కోట్ల రూపాయల వ్యయంతో "వై" ఆకారంలో నిర్మించిన ఈ వంతెన అందుబాటులోకి వస్తుండటంతో గచ్చిబౌలికి వెళ్లే ఐటీ ఉద్యోగులతోపాటు గోపన్‌పల్లి , తెల్లాపూర్, నల్లగండ్ల, కొల్లూరు వాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

PTC, HYD

**PROJECTS**

**BHADRADRI:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భద్రా చలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఇది 31 అడుగులకు చేరుకుంది. ఎగువన ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టు జలాశయానికి వరద పోటెత్తింది. ఈ ఉదయం ప్రాజెక్టు 20 గేట్లను ఎత్తి 66 వేల 900 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి మట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.

**GADWALA:** గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టుకు అధికారులు 5 గేట్లను ఎత్తారు. ప్రాజెక్టుకు 70 వేల క్యూసెక్కులు నీళ్లు వస్తుండ గా 32 వేల 267 విడుదల చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా , ప్రస్తుతం 1066 అడుగులకు చేరుకుంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం ఎగువన ఉన్న ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల నుంచి 57 వేల క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. దీంతో శ్రీశైలంలో నీటి నిల్వ 811 అడుగులకు చేరింది.

మరోవైపు నాగర్జున సాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీలో ఉన్నప్పటికీ , రెండు తెలుగు రాష్ట్రాల సాగు , తాగు నీటి అవసరాల కోసం సుమారు 8 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. హైదరాబాద్ లోని హుసేన్ సాగర్ కూడా పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువగా ఉండటంతో , అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

Desk/MSL, PTC- Kottagudem, Nalgonda

## CIVIL AVIATION – AIRPORT

దేశ వ్యాప్తంగా విమాన సేవలు సాధారణ స్థితికి వచ్చాయని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. మైక్రో సాఫ్ట్ ఔటేజ్ కారణంగా నిన్న విమాన సేవల కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. నిన్న సంభవించిన అంతరాయం కారణంగా ఏర్పడిన స్తంభనలు క్రమంగా సద్దుమణుగుతున్నాయని తెలిపింది. ప్రభుత్వం నిరంతంరం విమానాశ్రయాల వద్ద కార్యకలాపాలను పర్యవేక్షిస్తోందని, అలాగే విమానయాన సంస్థలు నడిపే ప్రయాణాల రాకపోకల మార్పులు, పునరుద్దరణ, ఛార్జీలను తిరిగి ప్రయాణికులకు ఇవ్వడం వంటి అంశాలను కూడా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.

NSD

## RGI AIRPORT

శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య ముగియడంతో విమానాలు యథావిధిగా నడుస్తున్నాయని అధికారులు తెలియజేశారు. ప్రయాణికుల ఆన్లైన్ చెక్ఇన్ కూడా సాఫీగా సాగుతోందని పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ విండోస్ , క్లౌడ్ సాఫ్ట్ వేర్ అప్డేట్ సమస్య రావడంతో నిన్న మధ్యాహ్నం నుంచి దేశ విదేశాలకు వెళ్లాల్సిన 36 విమాన సేవలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు గంటలపాటు విమనాశ్రయంలో పడిగాపులు కాశారు.

DESK